

రుణమాఫీ చెక్కును రైతులకు అందిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

రెండో విడుతలో రూ. 250.04 కోట్ల రుణమాఫీ

- అదనపు కలెక్టర్ బీఎస్ లత

సూర్యాపేట, జూలై 30 : రుణమాఫీ రెండో విడుతలో సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 26,376 మంది రైతులకు రూ. 250.07 కోట్లు మాఫీ అవుతుందని అదనపు కలెక్టర్ బీఎస్ లత తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం రెండో విడుత రుణమాఫీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మొదటి విడుతలో జిల్లాలో లక్ష లోపు రుణాలు ఉన్న 56,217 మంది రైతులకు రూ. 282.78 కోట్లు మాఫీ అయిందన్నారు. మొదటి, రెండు విడుతల్లో జిల్లా వ్యాప్తంగా 82,593 మంది రైతులకు రూ. 532.85 కోట్లు అవుతున్నదని తెలిపారు. ఏదైనా సాంకేతిక కారణంతో రుణమాఫీ జరుగని రైతులు మండల, డివిజన్ వ్యవసాయ అధికారులను సంప్రదించాలని చెప్పారు. రైతులు ఆధార్ కార్డుకు అనుసంధానం చేసినా ఫోన్ నంబర్ తప్పుగా ఉండడం వల్ల కొందరికి రుణమాఫీ కాలేదని, అలాంటి వారు ఏఈఓను కలిసి సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తిరుమలగిరి మున్సిపల్ చైర్ పర్సన్ చాగంటి అనసూయ, ఆర్డీఓ వేణుమాధవ్‌రావు, వ్యవసాయ అధికారి శ్రీధర్, ఎల్ డీయం బాపూజీ, డీసీఓ పద్మజ, వివిధ బ్యాంకుల మేనేజర్లు, రైతులు పాల్గొన్నారు.

వీరాంజనేయ ఆలయంలో నిత్య ధూప,దీప నైవేద్యం

ఆత్మకూర్.ఎస్, జూలై 30 : మండలంలోని గట్టికల్లు గ్రామంలో ఉన్న అభయ వీరాంజనేయ ఆలయంలో నిత్య ధూప, దీప కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి, హెచ్‌పీఈ నాయకుడు మల్లికావల్లభ ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. వందల ఏండ్లుగా పూజలకు నోచని అభయ వీరాంజనేయ స్వామి ఆలయంలో నిత్యపూజలు నిర్వహించేందుకు గ్రామస్తులు ముందుకు వచ్చారు. ఆలయంలో అర్చకులు పూర్ణ కలశంతో స్వామి వారి సన్నిధికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకన్న, గోవర్ధనాచార్యులు, శాస్త్రీయ సంగీత గురువు బాలసుబ్రహ్మణ్యం, భజన కళాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాస్టర్స్ నడిగూడెం మండల కార్యవర్గం

నడిగూడెం : పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గాన్ని సన్మానిస్తున్న క్రైస్తవ సంఘం నాయకులు

నడిగూడెం, జూలై 30: మండల పాస్టర్స్ ఫెలోషిప్ మండల కార్యవర్గాన్ని మంగళవారం మండలంలోని వల్లాపురంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గాబ్రియేల్, ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్, ట్రెజరర్‌గా జాన్ మార్క్, ఉపాధ్యక్షుడిగా సుధాకర్, జాయింట్ సెక్రటరీగా సామ్యూల్, గౌరవాధ్యక్షురాలిగా సీహెచ్. రాణి ఎన్నిక య్యారు. కార్యక్రమంలో జాతీయ క్రైస్తవ నాయకుడు సామ్యూల్, సంఘం నియోజక వర్గ అధ్యక్షుడు బిషప్ సుదర్శనం, జోసఫ్, శ్రావణ్ పాల్గొన్నారు.

నూతనకల్‌లో..

నూతనకల్ : పాస్టర్స్ ఫెలోషిప్ మండల కార్యవర్గాన్ని మంగళవారం మండల కేంద్రంలోని బిలివర్స్ ఈస్టర్న్ చర్చ్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నకిరేకంటి సైమన్, ఉపాధ్యక్షుడిగా మరికంటి ఇర్మియ, ప్రధాన కార్యదర్శిగా పిట్టల సామేల్, ట్రెజరర్‌గా నకిరేకంటి మనషే, ఆర్గనైజర్‌గా ఏటుకూరి డేవిడ్, సహాయ కార్యదర్శి బాలరాజు ఎన్నిక య్యారు. కార్యక్రమంలో రెమిడాల రూబెన్, వీరేశ్, బాలూనాయక్, వీరారెడ్డి పాల్గొన్నారు.

మహిళల సమస్యల పరిష్కారానికి పోరాటాలు

- మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన

సమావేశంలో మాట్లాడుతున్న ఉస్తెల సృజన

నేరేడుచర్ల, జూలై 30 : రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మహిళా సమాఖ్య పోరాటాలు నిర్వహిస్తున్నదని సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ భవన్‌లో జరిగిన సమాఖ్య జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని సూచించారు. ఉప్పతల కోటమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ దనుంజయనాయుడు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లీశ్వరి, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న 13 మందికి రిమాండ్

- రెండు కిలోల గంజాయి స్వాధీనం

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, జూలై 30: మిర్యాలగూడ పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న 13 మంది ముఠాను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన చెల్లా శివనాగరాజు, మంజుల లక్ష్మీ, దుర్గారావు ఒడిశాలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి కొంత లాభం చూసుకొని మిర్యాలగూడకు చెందిన షేక్ సమీర్, సిరిపాటి రవీందర్, దుద్దుడుకు అంజి, చెలిమండ్ల సుభాశ్, ధీరావత్ ఉపేందర్, మీసాల ప్రవీణ్‌కుమార్, తరుణ్, సమీర్, శివాజి, బిహార్ రాష్ట్రానికి చెందిన యాదాద్రి పవర్ ప్లాంట్‌లో పనిచేసే లాలుకుమార్‌యాదవ్‌కు విక్రయిస్తున్నారు. వీరంతా మిర్యాలగూడ రైల్వే స్టేషన్ వద్దగల చెట్ల పొదల వద్ద విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో 13 మందిని అదుపులోకి విచారించినట్లు చెప్పారు. నేరం ఒప్పుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి రెండు కిలోల గంజాయి(సుమారు రూ.26వేలు), ఐదు సెల్‌ఫోన్లు, రూ.3,500నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 13 మందిని కోర్టులో రిమాండ్ చేసినట్లు వివరించారు. సమావేశంలో రూరల్ సీఐ వీరబాబు, ఎస్ఐలు నరేశ్, విజయ్‌కుమార్, ఏఎస్ఐలు యాదగిరి, రాములునాయక్, ఉమాపతిరావు, సిబ్బంది ఉన్నారు.

3న ఉచిత ఆరోగ్య అవగాహన శిబిరం

మటంపల్లి, జూలై 30 : మండలంలోని రఘునాథపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆగస్టు 3న ఉచిత ఆరోగ్య అవగాహన శిబిరం నిర్వహించనున్నట్లు మఠంపల్లి పీఏసీఎస్ చైర్మన్ జువ్వాజి రామచంద్రయ్య తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వికాస తరంగిణి కార్యక్రమంలో భాగంగా మహిళా వికాస్ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు గర్భకోశ వ్యాధులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

- కంకర తేలి, గుంతలమయంగా మారిన తాటిపాముల-తిరుమలగిరి రోడ్డు
- వర్షం కురిస్తే రాకపోకలు బంద్
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

గుంతలమయంగా మారిన తిరుమలగిరి- తాటిపాముల రోడ్డు

తిరుమలగిరి, జూలై 30 : మండల కేంద్రం నుంచి తాటిపాముల, నందాపురం, ఈటూరు గ్రామాలకు వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా మారింది. రోడ్డు పూర్తిగా కంకరతేలి, గుంతల మయంగా మారడంతో ప్రజలు, వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిండి వాహదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధానమంత్రి సడక్ యోజన కింద 2015లో రూ. 5.32లక్షలతో తిరుమలగిరి, నందాపురం, తాటిపాముల, ఈటూరు గ్రామాలను కలుపుతూ 8.60 కిలోమీటర్ల బీటీ రోడ్డు వేశారు. ప్రస్తుతం రోడ్డు పూర్తిగా దెబ్బతింది. గుంతలు పడి, కంకర తేలి రోడ్డు ఆనవాళ్లు లేకుండా పోయింది. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు, రైతులు నిత్యం ఈ రోడ్డు గుండానే ప్రయాణిస్తుంటారు. రోడ్డు సరిగా లేక పోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.

రాత్రి వేళల్లో ప్రమాదాలు

రాత్రి వేళల్లో గుంతలు కనిపించక వాహనాలు అదుపు తప్పి కింద పడడంతో గాయాల పాలైన ఘటనలూ చోటు చేసుకున్నాయి. వర్షం కురిస్తే ప్రయాణం మరీ నరకంగా మారుతుందని ప్రజలు వాపోతున్నారు.

భారీ వర్షాలు వస్తే తాటిపాముల, తిరుమలగిరి గ్రామాల మధ్య వాగు పొంగి రాక పోకలకు అంతరాయం కలుగుతున్నది. ఈ రెండు గ్రామాల మధ్య రెండు చోట్ల కల్వర్టులు నిర్మించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోక పోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

అసంపూర్తిగా కల్వర్టు

నందారపురం నుంచి అనంతారం వరకు ఉన్న బీటీ రోడ్డుపై నిర్మిస్తున్న కల్వర్టు పనులు అసంపూర్తిగా ఉండటంతో ప్రజలు, వాహదారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే కల్వర్టు పూర్తి చేసి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వర్షం పడితే నరకమే

తిరుమలగిరి నుంచి తాటిపాముల గ్రామానికి వెళ్లే రోడ్డు మొత్తం గుంతల మయంగా మారింది. వాన పడితే ఈ రోడ్డుపై ప్రయాణం నరకమే. రాత్రి వేళల్లో అసలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దాంతో చాలా మంది జనగాం జిల్లా మొండ్రాయి గ్రామం మీదుగా చుట్టూ తిరిగి వెళ్తున్నారు. తాటిపాముల గ్రామ ప్రజలు నిత్యం వివిధ పనుల కోసం తిరుమలగిరికి వచ్చి పోతుంటారు. రోడ్డు బాగా లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మర్మమతులు చేయించాలి.

-కందుకూరి కాంతయ్య, తాటిపాముల గ్రామం

ఆలయ భూముల ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలి

- తాసీల్దార్‌కు ఆంజనేయస్వామి ఆలయ కమటీ సభ్యుల వినతి

ఆత్మకూర్.ఎస్, జూలై 30 : మండలంలోని ఏనుబాముల గ్రామ రెవిన్యూ పరిధిలో సర్వే నంబర్ 214లో గల లో శివాలయ భూములను కోటినాయక్‌తండాకు చెందిన కొంత మంది ఆక్రమించుకుంటున్నారని, వారి బారి నుంచి భూములను కాపాడాలని కోరుతూ ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తాసీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. వినతి పత్రం అందించిన వారిలో కమిటీ సభ్యులు ఎస్.వెంకట్‌రెడ్డి, వర్రె లింగయ్య, సైదులు, గజవెల్లి సూరయ్య, వి.రాములు, జి.మల్లారెడ్డి, కటకుట్ల సైదులు, లక్ష్మారెడ్డి ఉన్నారు.

ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

కోదాడ రూరల్, జూలై 30: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పట్టణ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక పాలన సాగిస్తూ దేశాన్ని ధనిక వర్గాల చేతుల్లో పెడుతున్నదన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాస్‌రావు, బత్తినేని హనుమంతరావు, పట్టణ కార్యదర్శి ఎస్‌కే లతీఫ్, బద్దం కృష్ణారెడ్డి, వెంకటనారాయణ, శ్రీనివాస్, ఎస్‌కే నాగుల్ మీరా, అంజమ్మ పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడి మృతికి సంతాపం

మోతె, జూలై 30 : మండలంలోని బురకచర్ల గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు పేరెల్లి ఈదయ్య(75) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు గ్రామానికి వెళ్లి ఈదయ్య మృతదేహంపై పార్టీ పతాకాన్ని కప్పి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ మండల కార్యదర్శి ములుకూరి గోపాల్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి కొండ భాస్కర్ ఉన్నారు.

హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ప్రవీణ్ కుమార్

హుజూర్‌నగర్, జూలై 30 : హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ప్రవీణ్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన కరణ కుమార్ నకిరేకల్ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బదీలీ కాగా ఆయన స్థానంలో ప్రవీణ్ కుమార్ బాధ్యతలు తీసుకున్నారు.

'బీసీలు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి'

బొడ్రాయిబజార్, జూలై 30 : బీసీలు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వీరబోయిన లింగయ్యయాదవ్ పిలుపునిచ్చారు. బీసీల డిమాండ్ల సాధనకు ఆగస్టు 6,7 తేదీల్లో నిర్వహించే హలో బీసీ –చలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్లను మంగళవారం జిల్లా కేంద్రంలోని బీసీ సంఘం కార్యాలయం వద్ద ఆవిష్కరించి మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నా బీసీలకు రాజ్యాధికారం లేక పోవడం దురదృష్టకరమన్నారు. కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ యువజన సంఘం జిల్లా నాయకుడు బొలిశెట్టి వీరబాబు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోలోజు మహేశ్‌చారి, జిల్లా కన్వీనర్ బయ్య రాజేశ్ పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన వారు రక్తదానం చేయాలి

- ఏజీపీ సుధాకర్‌గౌడ్

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏజీపీ సుధార్‌గౌడ్

కోదాడ రూరల్, జూలై 30 : ఆరోగ్యవంతమైన వారు రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడాలని కోదాడ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్రాసిక్యూటర్ సంపెట సుధాకర్‌గౌడ్ అన్నారు. జైభీమ్‌యూత్ ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారులకు రక్తాన్ని అందించేందుకు మంగళవారం పట్టణంలోని కోమరబండ గ్రామంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత సమాజసేవలో ముందుండాలని సూచించారు. ఈ సందర్భంగా 35 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మత్యశాఖ వైస్ చైర్మన్ ముత్తయ్య, జైభీమ్‌యూత్ అధ్యక్షుడు నిఖిల్, నవీన్, ఉషన్న, గోపి, సచిన్, అనిల్, అరవింద్, లక్ష్మణ్, రాము, సిద్దు, రాకేశ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

- సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి శివకుమార్

సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి శివకుమార్

నేరేడుచర్ల, జూలై 30 : హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో రోడ్లు, డ్రైనేజీ వసతి లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిమెంట్ పరిశ్రమల వల్ల దుమ్ము, ధూళి, చెడువాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల వల్ల వచ్చే కాలుష్యం నుంచి ప్రజలను కాపాడేందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పార్టీ డివిజన్ కన్వీనర్ వాసా పల్లయ్య, ఏఐఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, పీఓఎల్ జిల్లా నాయకులు వాసా కరుణాకర్, రజాక్, విజయ్, రాములు, దేవయ్య, అజీమ్, రంగయ్య పాల్గొన్నారు.

నేటి అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేయాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్

సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్

బొడ్రాయిబజార్, జూలై 30 : విద్యారంగానికి 7.31శాతం నిధులు కేటాయించడం అన్యాయమని, దానిని 30 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ బుధవారం నిర్వహించే అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర కోత విధించడం అన్యాయమన్నారు. సంక్షోభంలో ఉన్న విద్యారంగాన్ని ప్రక్షాళన చేసి అభివృద్ధి చేసేందుకు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్యలను పరిష్కరించేందుకు ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య, జిల్లా అధ్యక్షుడు పుల్లూరు సింహాద్రి, కోశాధికారి బండి రవి, డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్, వీరబోయిన లింగయ్య పాల్గొన్నారు.

అనంతగిరి తాసీల్దార్‌గా హిమబిందు

హిమబిందు

అనంతగిరి, జూలై 30: మండల తాసీల్దార్‌గా హిమబిందు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లపల్లి తాసీల్దార్‌గా పని చేస్తున్న ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

రెవెన్యూ డీఏఓగా రాజేందర్‌రెడ్డి

డీఏఓ రాజేందర్‌రెడ్డి

హుజూర్‌నగర్, జూలై 30 : హుజూర్‌నగర్ రెవెన్యూ డివిజన్ ఏఓగా ఎన్. రాజేందర్‌రెడ్డి మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. నాగర్‌కర్నూల్ డీఏఓగా పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు.

నేడు సూర్యాపేటకు తాగునీటి సరఫరాలో అంతరాయం

బొడ్రాయిబజార్, జూలై 30 : సూర్యాపేట పట్టణానికి బుధవారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నదని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇమాంపేట మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్ నుంచి సూర్యాపేటకు వచ్చే పైప్‌లైన్‌కు మరమ్మతు చేపడుతున్నందున నీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

వైద్యుల నిర్లక్ష్యం.. బాలింతకు ప్రాణాపాయం

- జిల్లా కేంద్ర ఆస్పత్రిలో 22న డెలివరీ
- 4 రోజులకే ఊడిపోయిన కుట్లు
- రక్తస్రావంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స

నేరేడుచర్లలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శృతి

సూర్యాపేట అర్బన్/గరిడేపల్లి, జూలై 30 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా బాలింతకు ప్రాణాపాయం ఏర్పడింది. బాధితురాలి తండ్రి సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన గర్భిణి శృతిని కాన్పు నిమిత్తం కుటుంబ సభ్యులు ఈ నెల 22న సూర్యాపేటలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకు వచ్చారు. ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ఆస్పత్రి వైద్యులు కాన్పు కోసం చిన్న ఆపరేషన్ చేసి నామమాత్రంగా కుట్లు వేశారు. అనంతరం ఈ నెల 25న డిస్‌చార్జి చేయడంతో స్వగ్రామమైన పొనుగోడుకు తీసుకెళ్లారు. ఇంటికి వెళ్లిన మరుసటి రోజే బాలింతకు రక్తస్రావమై అపస్మారక స్థితికి చేరుకుంది. దాంతో కుటుంబ సభ్యులు నేరేడుచర్లలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. డెలివరీ సమయంలో చేసిన ఆపరేషన్‌కు కుట్లు సరిగా వేయకపోవడంతోనే సమస్య వచ్చిందని వైద్యులు తెలిపారు. నాలుగు రోజులుగా ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం అందిస్తుండడంతో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం వైద్యానికి రూ. లక్ష ఖర్చు అయ్యిందని, దాంతో తాము ఇబ్బందులు పడుతున్నట్లు బాధితురాలి తండ్రి వాపోయాడు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ వైద్యశాలల్లో నాణ్యమైన ఉచిత వైద్యం లభించిందని, ఇప్పుడు కూడా అలాగే అందుతుందని భావించే సూర్యాపేట ప్రభుత్వ దవాఖానకు తన కూతురిని తీసుకెళ్లినట్లు సైదులు తెలిపాడు. కానీ సరైన వైద్యం అందలేదని, కనీసం డిస్‌చార్జి సమయంలో మందులు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు ఈ విషయమై విచారణ చేపట్టిన తమకు న్యాయంచేయాలని కోరాడు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



తిరుమలగిరి : సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

తిరుమలగిరి, జూలై 30 : సీజనల్ వ్యాధులపై మండలంలోని తాటిపాముల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సంధ్యారాణి, ఆశ వర్కర్ ఐలా సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

అర్వపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డాక్టర్ మణిదీప్ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమ కాటువల్ల వచ్చే వ్యాధి గురించి వివరించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి బిచ్చునాయక్, ప్రధానోపాధ్యాయుడు విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు లలిత, జ్యోతి ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దర్వేశిపురంలో ఎమ్మెల్సీ సారయ్య పూజలు



రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

రామగిరి, జూలై 30 : దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ అమ్మవారిని మంగళవారం ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు నాగోజు మల్లాచారి ఆధ్వర్యంలో అర్చక బృందం పూజ అనంతరం అమ్మవారి సన్మానించి వేద ఆశీర్వచనం చేశారు. అలాగే పానగల్‌లోని ఛాయా, పచ్చల సోమేశ్వరాలను సందర్శించి నల్లగొండలోని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ నివాసానికి వచ్చి వెళ్లారు. ఎమ్మెల్సీ సారయ్య సతీమణిని ఆయన స్వాగతం పలికి అందజేశారు. కార్యక్రమాల్లో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుకరాజు చెన్నయ్య, రజక అభివృద్ధి సంస్థ జిల్లా అధ్యక్షుడు చిలుకరాజు సతీశ్ తది త రులున్నారు.

అమ్మోరు తల్లిగా రేణుకా ఎల్లమ్మ దర్శనం

ఆషాఢ మాసం పురస్కరించుకుని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ అమ్మవారు మంగళవారం అమ్మోరు తల్లిగా అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. దాంతో భక్తులు పెద్దసంఖ్యలతో తరలివచ్చి దర్శనం చేసుకుని బోనాలు, ఒడి బియ్యం పోశారు.

వాగ్దానాల అమలుకు ఉద్యమాలు : సీపీఎం

సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

రామగిరి, జూలై 30: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలుకు ఉద్యమాలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండలోని దొడ్డి కొమురయ్య భవనంలో మంగళవారం నిర్వహించిన పార్టీ జిల్లా కమిటీ, మండల కార్యదర్శుల సంయుక్త సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్ల